# పలుకురాళ్ల మీద రెండెడ్ల బండి ప్రయాణం

... నవ్వులూరి వెంకటేశ్వర రావు ...




**ఎగువకు -**

**కుదుపుతో నాయనమ్మ ఒళ్లో పడ్డా.**

**"పోనీ నా వళ్లో తలపెట్టుకుని పడుకో," అంది.**

**"అప్పడే ఏం నిద్రరా?" అన్నాడు విస్సా నర్సయ్య, ఆవులిస్తూ.**

**ఆవులించి, "నీ నిద్ర నన్నూ ఆవరిస్తోందిరా అంటువ్యాధిలా," అన్నాడు.**

నాయనమ్మ నవ్వింది తెరలు తెరలుగా. స్వంత మాటలకన్నా ఆమె నవ్వు ఎక్కువ నవ్వించినట్లుంది, విస్సా నర్సయ్యానవ్వాడు. ఇద్దరి నవ్వులు విని కిష్టడు నవ్వేడు -కిచకిచ-నవ్వులకు కారణం తెలీక పోయినా. ఆ నవ్వుల వెల్లువకు నానిద్ర కాస్తంత పక్కకు తప్పుకుంది. నవ్వులకు బెదిరినట్లు ఎద్దుల నడక వేగం పుంజుకుంది. పుంజుకున్న వేగాన్ని సూచిస్తూ వాటి మెళ్లో గంటలు మోగుతున్నాయి.

పడుకోనని బెట్టుసరిగా చెప్పేను.

ఎంతరాళ్లు అయితే మాత్రం ఇంత కఠినంగా, ఘోరంగా వుండాలా అని ఆ రాళ్ల కఠినత్వానికి లబలబమంటూ పలుకురాళ్ల మీద బండి చక్రాలు దొర్లుతున్నాయి. రెండు ఎద్దులు లాక్కుపోతుంటే చక్రాలు దొర్లకుండా వుండగలవా?

"ఒరేయ్ కిష్టా ఇంత కంది నేసుకో(రా బండికి? ఎట్లా కీచుమంటున్నాయో చూడు ఇరుసులు," నర్సయ్య అన్నాడు.

దారిపొడుగునా కీచురాళ్లు అరుస్తున్నాయి, "మేము ప్రాణమున్న జీవులం, మాకు 'రాళ్లు' అని ఎందుకు పేరు పెట్టారు?" అని ఆక్రోశిస్తూ.

ఈ రొదకు తోడు నర్సయ్య గొంతు చించుకుని నాయనమ్మతో మాట్లాడుతున్నాడు. విస్సావారి ప్రతి అభిప్రాయాన్ని "వావ్వా" అనకుండా మెచ్చుకుంటూ, మెచ్చుకుని మెచ్చుకుని నోరు నొప్పి పుట్టినపుడు తల ఊపి తన ఆమోద ముద్రని నర్సయ్య అమూల్యమైన అభిప్రాయాలపై వేస్తోంది. ఎదురు మాట్లాడకుండా, పై పెచ్చు అన్నదానికల్లా వంతపాడే మనిషి దొరికితే ఎవరు మాత్రం రెచ్చిపోరు? నర్సయ్య చేస్తున్నది అదే.


'వాళ్ల అమ్మని, నాన్నని వదిలి మాతో పెళ్లికి వస్తున్నాడు గదా, అయిదు రోజులు ఉండగలడా?'

"ఉంటాడు. ఉండాలి. అలవాటు కావాలి గదా. వీడి నాన్నని తీసుకెళ్లి వీడి అమ్మ రేపు కావలిలో కాపురంపెడితే వీడు నాదగ్గిర, ఇక్కడే ఉండక తప్పదుగదా. వీడి నాన్న పక్షవాతపు రోగం తగ్గటానికి ఎంతకాలం పడుతుందో, ఏమో..." గొంతు పూడుకు పోయింది. ఏడుస్తోంది.

"తలరాత. ముప్పై ఎనిమిదేళ్లకే మంచం పట్టించే జబ్బు రావడం ఏమిటి ?"

"నేను బయలు దేరేటప్పుడు మరీమరీ చెప్పేడు, తద్దినం దగ్గిర పడుతోంది, ఎల్లాంటి పరిస్థితులలోనూ రెండు రోజులు ముందుగానే వచ్చెయ్యామ్మా అని."

నర్సయ్యకి నా అన్న దిక్కు లేదు. మా కుటుంబ స్నేహితుడు. చెయ్యెత్తు మనిషి. మా ఇంట్లో, మా నాయన ఆయన నాయన తద్దినం పెట్టినపుడల్లా ఈయన భోక్త. జగ్గయ్య మంత్రం చెప్పేవాడు. జగ్గయ్య, నర్సయ్య ఒకళ్ల పక్కన ఒకళ్లు కూర్చుని చారెళ్లలోకి నెయ్యి పోయించుకుని పప్పన్నం వాయులు కలుపుతున్నపుడు, ఆవ పచ్చడిలో సగం సగం గారెలు ముంచి నోళ్లకు చేరుస్తున్నప్పుడు - ఒకపోటీ చూస్తున్నట్లుగానూ, కనుల విందుగానూ వుండేది. నా ఆకలి నేను మరిచి చూస్తుండి పోయేవాడిని - (" బ్రాంబలు తినందే తినకూడదు నాయనా!") ఆయనది అయ్యవారిపల్లె, (మంగలి చెంగయ్య మాకు, మా నాయనమ్మకూ క్షురకర్మ చెయ్యటానికి అక్కడినించే వచ్చేవాడు - వాడికి ఆ పని తప్ప మిగతా పనులు వచ్చు - అది వేరే విషయం.) మా నాయనకు మిగతా రోజుల్లో జంధ్యం ఒంటి మీద వుండేది కాదు. తద్దినానికి కొత్త జంధ్యం వేసుకోటం - ఒంటి మీద ఏదో పురుగు పాకుతున్నట్లు, మరుసటి రోజు అవతల పడెయ్యటం!





"నీలపు రంగు అంచు, సిందూరం రంగు పట్టు పంచెలో దేదీప్యమానంగా వెలిగిపోయేవాడు కదూ లక్షరసు (లక్ష్మీనరసు) - అసలే దబ్బపండు చాయ, కోటేరేసిన ముక్కు. పోయిన సంవత్సరం, అనారోగ్య కారణంగా తను తన తండ్రి తద్దినం పెట్టలేక పోయినందుకు మంచంలో పడి వలవలా ఏడ్వలా?" నర్సయ్య అన్నాడు గతం గుర్తుకు తెచ్చుకుంటూ," వాడిది ఘనమైన చెయ్యి."

"ఈ సారి రెండోవాడు పెట్టక తప్పదు."

"ఒరే కిష్టా, ఇల్లా అయితే పెళ్లికి కాదురా బారసాలకి చేరతాం, " నర్సయ్య రంకెవేశాడు.

"నిద్రబోతున్నాడేమో కాడిలో కూర్చుని," నాయనమ్మ అందుకుంది. "కిందికి దొర్లితే ఎడ్లు

### చెడు అలవాట్లు



తండ్రి : ఏమిట్రా వాసు! రోజు రోజుకి నీలో చెడు అలవాట్లు ఎక్కువైపోతున్నాయి?

కొడుకు : మంచి వాళ్లను భగవంతుడు తొందరగా తీసుకుపోతాడని మీరేగా చెప్పారు డాడీ!

**విశ్వతేజ** (చంద్రవరం)

తొక్కుతాయి వెధవని," బండి జెల్లలో లేచి నిలబడి చూశాడు - కాళ్లు సాగినట్లూ వుంటుందని.

"ఏరా, వినబడలా? సమాధానం చెప్పవు, బెల్లం కొట్టిన రాయిలా?"

"తోలుతుండా కదా అయ్యవారా?" అన్నాడు కిష్టడు.

ఒంటినిండా కప్పుకోవటానికి గుడ్డలేకపోయినా ఎంత సంతృప్తి కనిపించేది వాడి ముఖంలో! మూడు రాగి సంకటి ముద్దలు, రెండు చారెళ్ల ఎర్రగడ్డ-చింతపండు పచ్చడి వేసిన విస్తరి కిందవుంచు తున్నపుడు, అమృతం పంచిన మనిషిని చూసినట్లు చూసేవాడు అమ్మని. వాడి పెళ్లాం తిరిపెం వాడి గురించే పుట్టింది. వాడు గుర్తుకొచ్చి నపుడల్లా ఇట్లా అనిపిస్తుంటుంది -

"ఈ మాయదారి రోగం వల్ల తమ్ముడి పెళ్లికి రాలేకపోతున్నందుకు ఒకటే కంట తడిపెట్టటం. పులిలాంటి మనిషి; తడి ఎరగని కళ్లవాడు - చూడు నర్సయ్యా ఏ గతి పాలయ్యాడో? వయసు మళ్లిన దాన్ని, ఎందుకు బ్రతుకుతున్నానో అర్థం కాని దాన్ని - నన్ను చూడు ఎట్లావున్నానో-గుండ్రాయిలా!"

"జీవితార్థాలు తెలుసుకోటం మనతరమా? గుండ్రాయిల్లా ఉండటం, ఉండకపోవటం మన చేతుల్లో వుందా?" పొగాకు, సున్నం పూసిన తమలపాకు, వక్క ఉండగా చుట్టి బుగ్గకు తోస్తూ అన్నాడు.

క్షణం ఊరుకుని, "శంకరమ్మా, నీ బతుకు బండలుగాలా మధ్యవయసులోనే? భగవంతుడి ఇచ్చ ఎట్లా..." తమలపాకు ఊట బండిలోనించి బయటికి ఉమ్మటానికి మాటలు ఆపేడు.

"నీది మాత్రం? ఒక తోడా నీడా? ఒంటరి బ్రతుకు. అయితే, వాడు నీకు భరించే శక్తిని ఇచ్చాడు నరసయ్యా."

"ఇచ్చాడా, చచ్చాడా? భరించక తప్పనపుడు చేసేదేముంది చావటం తప్ప. చావటానికీ ధైర్యం వుండి చావద్దూ?"

కిష్టడు పాడుతున్నాడు. ఆ పాట గుర్తు లేదు. నిశ్చింతగా ఉన్నవాడు మాత్రం పాడగలిగిన పాట. మందు కొట్టకుండానే మత్తుగా పాడుతున్నాడు. పామరుడికి అర్థమయ్యేపాట - పాడేది పామరుడు కాబట్టి. కవిత్వపు మడి కట్టుకోనిది. బాధను మరపింపజేసే అంజనం వంటిది. ఏ పూటకాపూట తిండికి వెతుక్కోవాలన్న చింత ఈ తామరాకుకి అంటదు.

"ఒరే, తిరపేన్ని జంటగా తెచ్చుకోవలసిందిరా, గొప్ప కులాసాగా పాడుతున్నావ్", గావుకేక పెట్టేడు నర్సయ్య.

'అదెందుకులే అయ్యవారా, పెళ్లికెళ్తా పిల్లిలా.'

"ఓరినీ! అవును - అది పిల్లి, నువుపులి. ఆ పిల్లి ముందు మాత్రం ఈ పులితోక ముడుస్తుంది. దానిముందు అన్ని విధాల నువ్వు దిగదుడుపు గదరా!"

వినిపించివుండదు. లేక వినిపించిందో. వాడి దగ్గరి నించి సమాధానం లేదు. కిష్టడు ఎడ్లను అదిలించాడు. చెలుకోలతో కొడుతున్నాడు. నర్సయ్యమీది కోపం పశువులను బలితీసుకుంటోందా?

"ఒరే కిష్టా, వాటిని అట్లా కొట్టేవని తెలిస్తే పెద్దాడు నీ ప్రాణం తీస్తాడు... వాడు జబ్బుతో తీసుకోకపోతే ఈ బండి వాడు తోలాల్సింది కదూ." రెండో వాక్యం నర్సయ్యతో అంది.

"ఎద్దును కొట్టటానికి కాకపోతే చెలుకోలెందు కమ్మా?" కుమారిల భట్టు వద్ద తర్కం అభ్యసించిన వాడిలా అన్నాడు కిష్టడు.

'అదివుంది కదా, కొట్టాలి - అని కొడతావురా? అడిగింది ఈమె; ఎంతైనా శంకరమ్మ కదా.

"అదేందో శంకరమ్మా, నీ పెద్ద కొడుకు వీటి ఒంటిని నిమిరితే చాలు వాడి మనసులోని మాట తెలుసుకుని పరిగెత్తేవి కదూ? తోబుట్టువుల్లా చూసుకునేవాడు కదా వీటిని!"

"ఎకరా పొలం అమ్మకానికి పెట్టాం. మరో ఊర్లో కాపురం, చికత్స అంటేఅంటే మాటలా?"

"విన్నా. ప్రయాణం వచ్చే నెలలోనే నట గదా?"

"శిస్తు కట్టటానికి ఒక ఎకరా అమ్మాల్సొచ్చింది నిరుడు."

కళ్లు తుడుచుకుంటోంది. ఎందుకో భుజం మీద చెయ్యేసి నన్ను దగ్గరకు లాక్కుంది. తుమ్మచెట్ల క్రిందనించి వెళుతోంది బండి. తుమ్మముల్లు గుచ్చుకుంటే ఎంత బాధో అనుభవ పూర్వకంగా తెలుసు. పట్టుపూల లాంటి తుమ్మపూలు రాలుతున్నాయి బండిలోకి అతిధి సత్కారంలా. సువాసన. తుమ్మబంక విలువైన రాళ్లలా వుంటుంది. పగిలిన హృదయాలను సయితం కాలం కన్నా శీఘ్రంగా అతికించగలదు.

## దిగువకు -

"అనారోగ్యవంతుడే కాదు, రూపూ అంతంత మాత్రం, తెలివి తేటలు శూన్యం, నరసయ్యా."

"చూడు శంకరమ్మా, ఆ రోజు అట్లా జరగాలని రాసి పెట్టివుంది. జరిగింది. కాలుజారిందేమో; ఏమరి పాటునవున్నాడేమో."

"భయమేసింది అంటాడు. అదేం పులి మీద స్వారీ కాదు గదా. గుర్రం మీద స్వారీ. పెళ్లివాళ్లేదో సరదా పడ్డారు. గుర్రాన్ని చూసి జడిస్తే ఎట్లా?"

"బండి కదిలీ కదలనట్లు వెళుతుండటం వల్ల, మెత్తటి తోవ కాస్త మేరకు తగలటం వలన, నాయనమ్మ మాటలు విన్నట్టున్నాడు కిష్టడు. కిచకిచనవ్వేడు.

"ఏరా, నీకీ మధ్య నవ్వు ఆగకుండా వస్తోంది, వెధవ," నాయనమ్మ చిన్నబుచ్చుకుని కేకవేసింది. చిన్న బుచ్చుకోదూ? స్వంత కొడుకు, పెళ్లి కొడుకు గుర్రం ఎక్కబోతూపడితే, అవమానం పాలయితే, నలుగురూ నవ్వితే?

"శంకరమ్మా, అవమాన గివమానాలు అటుంచు. ఏ ఎముకా విరగలేదు, గుర్రం తొక్కెయ్యలేదు - సంతోషం. పెళ్లికే అవాంతరం వచ్చేదేమో. అమ్మాయి అదృష్టవంతురాలు. లక్ష్మీ కళ ఉట్టిపడుతోంది. అన్నట్టు, మనవాడూ అదృష్టవంతుడే. కాకపోతే కుందనపు బొమ్మ పెళ్లాంగా దొరికేదా?"

తనకొడుకు అదృష్ట వంతుడని ఇతరులు అంటే సంతోషించని తల్లి వుండదు గదా. గుడ్డ తిత్తిలోనించి వక్క, ఆకు, సున్నం ఇచ్చింది నర్సయ్యకు. బుగ్గకు తోసి నవులుతున్నాడు. బండి ఊపుతోంది. పలుకురాళ్ల మీద ప్రయాణం. ఒళ్లుహూనం అవుతోంది.

"కిష్టా, వెళ్లేటప్పుడే అడుగుదామనుకుంటినీ, రెండూ ఈ బండి చక్రాలేనా, మరోదాన్ని ఈ తాడి చక్రానికి జోడించావా?"

"అయ్యవారు బలే నవ్వుపుట్టించే మాటలు మాట్టాడతారు," కిచకిచ నవ్వేడు.


"నా మాటలకు నీవు నవ్వకపోతే ఏం అనుకోనుగాని... నవ్వుకాదు నాక్కావాల్సింది. జవాబు."

"బలేవాడివే అయ్యవారా. అయ్యవార్లకు జబాబు చెప్పగలవంతటోడ్నా."

"వాడి బండబడ. సమాధానం ఇవ్వటం ఇష్టం లేకపోతే చస్తే ఇవ్వడు," నాయనమ్మ నవ్వింది - నెత్తిమీద గుడ్డను ముందుకులాక్కుని, జారకుండా చెవులమీదికి సర్దుకుని.

అయిదు బండ్లు ఒకదాని వెనుక ఒకటి ఆగుతున్నాయి. వెడల్పాటి ఏరు అడ్డుగా వచ్చింది. వెన్నెల, నీటి మడుగుల మీద పడి అవి పాదరసపు మడుగుల్లా మెరుస్తున్నాయి. చల్లటి గాలి ఏటి మీదుగా పయనిస్తూ ఏటిని పరామర్శిస్తోంది. ఒడ్డునున్న చెట్లు పాదరసపు మడుగులకు కాపలావున్నాయి. అవి చీకటిని నింపుకుని వున్నాయి.

మొదటి బండి నించి పెళ్లికూతురు, పెళ్లికొడుకు దిగేరు. ఆడ, మగ, పిల్లాజెల్లా అంతా కలిపి పాతిక మంది. పెళ్లికొడుకు కుంటుతున్నాడు. చీకటిలా దీనంగా వున్నాడు - విలువైన ఆమెను తోడుగా పొందినా. ఆమె అందానికే అందంలావుంది. వెన్నెల బొమ్మలావుంది. సంతోషంగా వుంది - అతను పక్కనున్నా. సిగ్గుగా, నెమ్మదిగా మాట్లాడుతోంది. కాలునొప్పి ఎట్లావుందని అడుగుతోందా? ఎందుకో ఇద్దరూ



ఆకాశం కేసి చూస్తున్నారు - ఏవో బాధలకు కారణమైన నేరస్తుడిని వెతుకుతున్నట్లు.

"అయేమీ కురిచే మబ్బులు కావులే అయ్యావారా - పేరుకే మబ్బులు," కిష్టడు అన్నాడు. అని, కిచకిచ నవ్వుతున్నాడు. వాడిలో ఎందుకంత సంతోషం పొంగిపొర్లిపోతుంటుంది?

"అందు గురించి కాదులేరా!" సన్నగా వణికింది పెళ్లికొడుకు గొంతు.

"మరి ఎందుకు ఆకాసెం కేసి ఇద్దరూ చూచినట్లు? ఇంకోమారు మా ఆడపడచుని చూట్టానికా?" కిచకిచ నవ్వేడు.

కిష్టడి ఆడపడచు ఎవరో ఆమెకు అతను చెప్పేడు. నేనూ ఆ నక్షత్రం కోసం చూశాను. పురోహితుడి మధ్యవర్తిత్వం లేనిదే కనబడదేమో.

బండి చక్రాలకు విశ్రాంతి. ఎడ్లకు విశ్రాంతి. ప్రయాణపు హింసనించి జనాలకు ఉపశాంతి. నిశీధి ప్రశాంతత మీది అత్యాచారానికి విరామం.


పాడి ఇసుక తిన్నెల మీద అందరూ భోజనానికి ఉపక్రమిస్తున్నారు. చెంబులు, గ్లాసులు బండ్లలోనించి తీశారు. అరిటాకులు తీశారు. జరీ అంచు చీరలలోని ఇద్దరు నడివయసు స్త్రీలు ఒక తడి ఇసుక తిన్నె మీద చెలమలు తీస్తున్నారు. చెంబులను ఆ నీటితో నింపుతున్నారు. పులిహోర, దద్దోజనం అరిటాకుల మీదికి చేరాయి. పిడికెడు పులిహోర వుంచుకుని మిగతాది పెళ్లికూతురు ఆకుమీదికి బదిలీ చేశాడు పెళ్లికొడుకు. దద్దోజనం రెండు పిడికిళ్లు వుంచుకున్నాడు.

పెళ్లికూతురు తన పక్కన కూర్చో బెట్టుకుంది నన్ను. తను తోడు పెళ్లికొడుకు గదా, ఆ అభిమానమేమో. ఆమె దగ్గిర కస్తూరి, కర్పూరం, గంధం వాసనలు వేశాయి - ఆపదార్థాలతో ఆమె తయారయినట్లు. "పులిహోర ఎక్కువ తినకు, కారం," అన్నది మృదువుగా - నిశీధి నిశ్శబ్దంలో వీణా నిక్వాణంలా. ఎందుకో ఆకాశం కేసి చూసింది. చూసి నవ్వింది, వెన్నెలలా. ఆమె కళ్లనిండా వెన్నెల. వెన్నెలంటే గిట్టనట్లు తన నీడను తనే చూసుకుంటూ, భోంచెయ్యడం ఒక శిక్షలా; వెన్నెట్లో ఏట్లో కూర్చోటం ఒక నరకం లా తలవంచిన పెళ్లికొడుకు...

"ఆలీశం అయిపోయింది ఇప్పటికే లేవండి, లేవండి", అని అందర్నీ లేవగొట్టాడు ఒక ముసలాయన. బండ్లు నిండాయి తిరిగి. కదిలాయి. ఎంతసేపుంటాయి మజీలీలు?

"మా బండ్లో కొస్తావా?" అడిగింది. పెళ్లి కూతురు. బెట్టు సరిగా రానన్నా. ప్రయాణం కొనసాగింది.

ఏమిటో వాటి దుంపతెగ, అన్నీ విడ్డూరపు సంఘటనలే జరిగాయి. పెళ్లి కూతురికి తేలు కుట్టటమేమిటి, మీ వియ్యంకుడు గుండెపట్టుకుని




పడిపోవట మేమిటి! అయితే, పైవాడి దయవలన అన్నీ అవాంతరాలను అధిగమించి పెళ్లి అయింది.'

"తేలు కుట్టినా కంట తడిపెట్ట లేదు పిల్ల. ఎంత నిగ్రహం!"

"నిండు కుండ తొణకదు."

"ఉన్న కాస్త పొలం అమ్మి అంతఘనమైన పెళ్లి చెయ్యమన్నామా నర్సయ్యా? ఆయన చేతికి చిప్ప వస్తుందని మనకేం తెలుసు. పరిస్థితి తెలిసిన తర్వాత ఆ కాస్త కట్నం డబ్బు ఇచ్చేస్తానన్నా. ససేమీ తీసుకోనన్నాడు - నియోగపు నిక్కు ఎక్కడికి పోతుంది."

"శంకరమ్మా, ఒక మాట అంటా' నీ కుటుంబ ఆత్మీయుడిగా స్వతంత్రం తీసుకుని. నీ వేమీ

శ్రీ



**హామీపత్రం**

"ఈ కథ నా స్వంతమేననీ, ఇంతకు ముందు నా పేరు మీద ఏ పత్రికలోనూ ప్రచురింపబడలేదనీ హామీ ఇస్తున్నాను. ఇంకొకరి పేరు మీద నయినా ప్రచురింపబడి ఉంటే, దానికి నేను బాధ్యుణ్ణి కాను.

రచయిత

వి.వి. సీతారామ్‌దాస్
(గుంటూరు)

అనుకోవని తెలుసు మీ వియ్యంకుడు గుండె పట్టుకుని పడిపోవటానికి మరో కారణం కూడా వుందని నాకు భోగట్టా అందింది. బంగారంలాంటి పిల్లని అట్లాంటి వాడికి కట్టబెట్టావేమిటి అని దగ్గిర బంధువులు అదేపనిగా తిట్టారట. పొరబాటు చేశానన్న బాధ కారణంగా కూడా అతగాడు విరుచుకుడి పోయివుంటాడు."

"నా చిన్న కొడుకు హృదయం నవనీతం నర్సయ్యా. అట్లాంటి గుణవంతుడు అసాధారణంగా గాని వుండడు."

ఈ విషయం నాకు చెప్పాలా శంకరమ్మా."

"పెళ్లి కూతురు కుటుంబ ఆర్థిక పరిస్థితి అట్లావుందనిగాని, తమ్ముడి గురించి అట్లా అన్నారని గాని తెలిస్తే పెద్దవాడు బాధపడిపోతాడు. ఊరు చేరంగానే వాళ్లడబ్బు వాళ్లకు పంపించేస్తా.'

"పిల్లే వుత్తడిబొమ్మ. వేరే డబ్బు ఎందుకులేమ్మా. నీ నిర్ణయం సరైనది. హర్షించదగింది. నీ చిన్నకొడుకును అడిగావా?"

"వాడు ఇట్లాంటివి పట్టించుకోడు గదా. అంత అందమయిన పిల్లని మంచి పిల్లని పెళ్లి చేసుకుని దానికి అన్యాయం చేశానేమోనని బాధపడ్డాడు. నిజానికి, డబ్బు ఇచ్చేస్తానంటే వాడి బాధలో కొంతైనా తీరుతుందేమో."

నిద్ర పట్టేసింది ఆ తర్వాత. కళ్లు తెరిచేసరికి ఊరు చేరుతున్నాం.

ఇప్పటికి రమారమి నలభై సంవత్సరాలు గడిచాయి. కిష్టడు లేడు, నర్సయ్యలేడు, నాయనమ్మ లేదు, నాన్నలేడు. మరో విషయం - పెళ్లి కూతురు చనిపోయినట్లు ఉదయమే వార్త వచ్చింది. అది రేపిన జ్ఞాపకమిది.

**(ఛెకోవ్‌కి అంకితం)**